క్లుప్తంగా

విద్యార్థులకు శ్లోకాల పఠనంపై శిక్షణ



భగవద్గీతలో శ్లోకాలు ఆలకిస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శ్లోకాలు పఠించడం నేర్పించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విశ్రాంత ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు భగవద్గీత శ్లోకాలు పఠించడంపై శిక్షణ ఇచ్చారు. రామాయణం, భాగవతంలో పలు అంశాలను కథల రూపంలో వినిపించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దప్పతల్లి జాతర

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి అగ్రహారం గ్రామంలో పెద్దప్పతల్లి జాతర మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, కౌన్సిలర్ గొర్లె సంధ్య, వెంకట్ పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా భారీ ఎత్తున మందుగుండు సామగ్రి వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. గురువారం వాడ్రాపల్లిలో నిర్వహించిన 104 వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు మందులు అందజేశారు. సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని నూకరాజు కోరారు. అలాగే వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ సీజన్‌లో రోగాలు దరి చేరకుండా చూసుకోవాలన్నారు. శిబిరానికి వైద్యాధికారి ప్రవలిక వైద్య సేవలందించారు. సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, సీతామహలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు, ఒకేషనల్ కోర్సులు ఇ.టి, ఒ.ఎ, ఎం.పి.హెచ్.డబ్ల్యు(ఎఫ్), సి.ఎస్.ఇలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, విద్యార్థులు త్వరితగతిన చేరాలని కోరారు.

పౌష్టికాహార పంపిణీ



పౌష్టికాహారంతో లబ్ధిదారులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని అంగన్‌వాడీ 4 అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఇంట్లో లభించే పప్పు దినుసులు, ఆకుకూరలతో పోషకాహారాన్ని తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చిక్కీలు అందజేశారు.

అచ్యుతాపురం జంక్షన్‌లో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): యువశక్తి ఆటో స్టాండ్ వద్ద గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ధర్మిరెడ్డి సన్నిబాబు సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఐద్వా జిల్లా అధ్యక్షులు పిట్ల మాణిక్యం ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ మేడే ఉత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అద్దంలా గ్రామీణ రహదారులు

- గతుకుల బాటలకు మోక్షం
- రూ.2.5 కోట్లతో రహదారుల అభివృద్ధి
- వాహనదారులకు తొలగిన ఇక్కట్లు



అద్దంలా దర్శనమిస్తున్న పాటిపల్లి-మూలపేట రోడ్డు



తిమ్మరాజుపేట నుంచి కుమారపురం వైపునకు వెళ్లే రోడ్డు

మునగపాక : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులకు మోక్షం కలిగింది. టీడీపీ హయాంలో శిథిలావస్థకు గురైన రహదారులు నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి... గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయి. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా రహదారులు, మురుగు కాలువలు తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఉపాధి హామీ పథకంతో...

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు గ్రామీణ రహదారులు అందంగా తయారయ్యాయి. పలు చోట్ల గోతులుగా ఉన్న రహదారులు ఈ పథకం ద్వారా బాగుపడ్డాయి. ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మునగపాక నుంచి పాటిపల్లి, వాడ్రాపల్లి తదితర గ్రామాలకు బైపాస్ రోడ్డును రూ.48 లక్షలతో నిర్మించారు. పాటిపల్లి నుంచి మూలపేటకు రూ.38 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. చూచుకొండ నుంచి రామగిరికి వెళ్లేందుకు వీలుగా రూ.48 లక్షలతో బీటీరోడ్డు నిర్మించారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల నుంచి మునగపాక మండలం చూచుకొండ మీదుగా కశింకోట మండలం నరసింగబల్లి వరకు రూ.2.4కోట్లతో రహదారిని అభివృద్ధి చేశారు. దీనికి తోడు రూ.1.15 కోట్లతో అంతర్గత రహదారులు నిర్మించారు. అనకాపల్లి బైపాస్ రోడ్డు నుంచి అచ్యుతాపురం వరకు గోతులతో దర్శనమిచ్చిన రహదారికి అధికారులు ఇటీవల మరమ్మతులు చేపట్టారు.

రూ.3.7 కోట్లతో మరికొన్ని ప్రతిపాదనలు

మండలంలోని పలు రహదారులు అభివృద్ధి చేయడానికి అధికారులు రూ.3.7కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. వాటిలో తిమ్మరాజుపేట నుంచి వాడ్రాపల్లికి రూ.80 లక్షలు, నాగులాపల్లి నుంచి తోటాడకు రూ.87 లక్షలు, రాజుపేట నుంచి కాకరాపల్లికి రూ.40 లక్షలు, నాగవరం పంచాయతీ అప్పికొండవానిపాలెం గ్రామానికి వెళ్లేందుకు రూ.25 లక్షలు, యాదగిరిపాలెం నుంచి జంపపాలెం వరకు రూ.38 లక్షలు కట్టవానిపాలెం వరకు రూ.47 లక్షల మేర నిధులు కేటాయించాలని కోరుతూ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. నిధులు మంజూరు కాగానే రహదారుల నిర్మాణాలను చేపట్టనున్నారు.

రోడ్ల దుస్థితి మారింది...



గ్రామీణ రహదారుల నిర్మాణాలు పూర్తయితే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులు, మురుగు కాల్వలు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత టీడీపీ హయాంలో రహదారులు శిథిలావస్థకు గురయ్యాయి. నేడు రహదారులు అద్దంగా దర్శనమిస్తున్నాయి.

– మద్దాల ధనలక్ష్మి, సర్పంచ్, సిరసపల్లి

అభివృద్ధికి బాటలు వేస్తున్నాం



నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నాం. శిథిల రహదారులను గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పలు రహదారులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేశాం. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం.

– యు.వి.రమణమూర్తిరాజు, యలమంచిలి ఎమ్మెల్యే

గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)అన్నారు. గురువారం పెదపల్లి గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ నెల 23వ తేదీన పెదపల్లి గ్రామంలో వేమాంబిక అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ క్రికెట్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 47 జట్లు పాల్గొంటాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందన్నారు. గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్త, కౌన్సిలర్‌లు పిట్టా సత్తిబాబు, డాక్టర్ త్రినాథ్, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, దాసరి కుమార్, కొడిగుడ్డు రమణ, దుంగా అచ్చుతరావు, గంధం శివ పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



పాటిపల్లి మోడల్ స్కూల్లో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : ప్రత్యేక శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. పాటిపల్లి మోడల్ స్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞాన కాంతులు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు



దేశ భక్తి గీతాలను ఆలపిస్తున్న దృశ్యం

కోటవురట్ల: గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు మంచి స్పందన వస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు పోటీలలో ఆసక్తి కనబరుస్తున్నారు. గురువారం గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఈ పోటీలో 21 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా శ్రీనివాసరావు వ్యవహరించారు.

విద్యార్థుల దేశభక్తి గేయాల ఆలాపన

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండల కేంద్రమైన శాఖా గ్రంథాలయంలో గురువారం దేశభక్తి గేయాలను విద్యార్థులు ఆలపించారు. వేసవి శిక్షణ తరగతుల 11వ రోజు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయురాలు జగదాంబ విద్యార్థులతో పలు దేశభక్తి గీతాలను పాడించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



10 గ్రేడ్ పాయింట్స్ సాధించిన నందిని

పాయకరావుపేట: ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5 వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా మాకినిడి నందిని, ఎంపిసిఎస్ గ్రూప్, 10 గ్రేడ్ పాయింట్స్ సాధించిందని స్పేసెస్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వీర్రాజు తెలిపారు. ఎంసిసిఎస్ లో కె.రేణుక 9.6, ఎంఇసిఎస్ కె.శిరీష 9.53, బయోటెక్‌లో టి.సౌజన్య 9.5, ఎంపిసిలో కె.రేష్మ 9.5, సిబిజెడ్‌లో బి.శ్రీఉష 9.2, బి.కాంలో పి.వి.సాయివాణి 9 గ్రేడ్ పాయింట్స్ సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు అభినందించారు.

ప్రయత్నం ఉంటే అన్ని రంగాల్లో రాణించవచ్చు



మాట్లాడుతున్న ధ్యానగురువు సుజాత

మునగపాక : ప్రతి పనిలోనూ ప్రయత్నం చూపాలని తద్వారా ఫలితం సొంతమవుతుందని ప్రముఖ ధ్యానగురువు సుజాత అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో చంద్రశేఖర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం యూత్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం శిక్షణ ఉంటేనే ఏ రంగంలో అయినా రాణించవచ్చన్నారు. ప్రతి మనిషిలోనూ దైవం ఉందని ఒక అడుగు మనం ముందుకేస్తే విశ్వం మరో వంద అడుగులు సహకరిస్తుందన్నారు. అలాగే యోగా సాధన చేయడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. గణిత ఉపాధ్యాయులు మూర్తి మాట్లాడుతూ గణితం అంటే కొంతమంది భయపడుతుంటారని గణితంతో తమాషాలు చేయవచ్చన్నారు. గణితంలో మెలకువలను ఆయన వివరించారు. కార్యక్రమంలో వాణిబాల, జగన్, శివాజీ, శ్రావణి పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలకు 10 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాంబిల్లి: జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేరేందుకు నిర్వహించిన పరీక్షలో వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం సూరాడ అప్పలరాజు తెలిపారు. తానాం, అన్నవరం, సింహాచలం రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఎరిపిల్లి గాయత్రి, సీహెచ్ భవాని, దూడ జ్యోత్స్న, మైలపల్లి మహేశ్వరి, మైలపల్లి భూమిక , మైలపల్లి నిహారిక, యజ్జల భవానీ, యజ్జల నివాస్, ప్రదీప్‌వర్మ, యజ్జల శ్యామ్ కౌశిక్‌లను హెచ్ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు రామకృష్ణ, బి. అనురాధ అభినందించారు.

తోటాడను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



గవర్ల అనకాపల్లిలో రహదారుల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మంగవేణి కోటేశ్వరరావు

మునగపాక : తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. పంచాయతీ పరిధిలోని గవర్ల అనకాపల్లిలో పంచాయతీ నిధులతో మూడు చోట్ల సీసీ రోడ్లు నిర్మించేందుకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటాడ పంచాయతీ పరిధిలో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్యం మెరుగునకు కృషి చేస్తామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సేవా వజ్ర'కు ఇద్దరు వలంటీర్లు ఎంపిక



గురువునాయుడు, వలంటీర్, నాగులాపల్లి



పల్లి సరోజిని, వలంటీర్, చూచుకొండ

మునగపాక: మండలంలోని ఇద్దరు వలంటీర్లు సేవా వజ్రం పురస్కారాలకు ఎంపికయ్యారు. నాగులాపల్లి-1 సచివాలయ పరిధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్న దొడ్డి గురువునాయుడు.చూచుకొండ నుంచి వలంటీర్‌గా సేవలందిస్తున్న పల్లి సరోజినిలు ఇరువురు నియోజకవర్గ స్థాయిలో సేవా వజ్రం పురస్కారాలకు ఎంపికైనట్టు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఇరువురికి అకౌంట్లలో రూ.30వేల వంతున నగదు జమ చేస్తారు. అలాగే సేవారత్నకు సంబంధించి మండలానికి ఐదుగురు వలంటీర్లు ఎంపికయ్యారు. వారి అకౌంట్లలో ప్రభుత్వం రూ.20వేల వంతున జమ చేస్తారు. సేవా రత్నం పురస్కారానికి సంబంధించి కిల్లాడ మాధవి(తిమ్మరాజుపేట), కాకర రవికుమార్(తోటాడ),ముప్పిడి శ్రీలక్ష్మి (తిమ్మరాజుపేట), కరణం రోహిణి(నాగవరం),బీలా నాగమణి(మునగపాక-2)లు ఎంపికయ్యారు. నియోజకవర్గ స్థాయిలో ఇద్దరు వలంటీర్లు సేవా వజ్రానికి ,మండల స్థాయిలో సేవా రత్నకు అయిదుగురు ఎంపికకావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రొయ్యల చెరువుల తనిఖీ



రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఫిషరీస్ ఏడీ ప్రసాదరావు

పాయకరావుపేట : రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. చేపల చెరువుల్లోని వ్యర్థాల కారణంగా సాగునీరు కలుషితమై పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మత్స్య శాఖ ఏడీ ప్రసాదరావు గురువారం చెరువులను తనిఖీ చేశారు. ఏడీ మాట్లాడుతూ మండలంలోని వెంకటనగరం గ్రామ సమీపంలో ఉన్న రొయ్యలు, చేపల చెరువుల నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాల కారణంగా సాగునీరు కలుషితమవుతోందని గ్రామ సర్పంచ్ వంకా రమణ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో చెరువులను తనిఖీ చేసినట్టు తెలిపారు. ఈ చెరువుల ఏర్పాటుకు ఏవిధమైన అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన చెరువులపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్టు తెలిపారు. ఈయనతో పాటు సర్పంచ్ వంకా రమణ, గ్రామస్తులు ఉన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- కేవలం అర్హతే కొలమానం
- జగనన్నను మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. గోవిందపాలెం సచివాలయం పరిధిలో గల కొత్తపేట గ్రామంలో గురువారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరింది వివరించి, ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అర్హత మాత్రమే కొనమానంగా తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ప్రతి పక్ష పార్టీలను గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేసే ఆరోపణలను నమ్మవద్దని హితవుపలికారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆనందం నెలకొనివుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు మహిళలు టి.లక్ష్మీ సత్యవతి, వరహా పార్వతిలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఎమ్మెల్యే తన సొంత నిధులను అందజేశారు. ఆయా గ్రామంలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, తహసీల్దార్ పి. భాగ్యవతి, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

గోవిందపాలెంలో గడప గడపకు నేడు

గోవిందపాలెంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు కోరారు.

మత్స్యకారులకు అండగా జగనన్న ప్రభుత్వం



మత్స్యకార సంఘ నాయకులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : మత్స్యకారులకు చెప్పిన వరాలు ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి రూ.10 వేలు భరోసా అందజేసి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేసిన నేత సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని, దీంతో మత్స్యకారుల్లో జగన్‌మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. చంద్రబాబునాయుడు మత్స్యకారుల ఓట్లు వేయించుకుని చాలాసార్లు మోసం చేశారన్నారు.

మత్స్యకార కుటుంబాలకు బీమా నగదు పంపిణీ

చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడిన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు బీమా నగదు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. ఈ మేరకు నక్కపల్లి మండలం బంగారయ్యపేటకు చెందిన యజ్జల కాంతంకు రూ.5 లక్షలు, ఎస్.రాయవరం మండలం కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన వాసుపల్లి సత్యవతికి రూ.5 లక్షలు బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నక్కపల్లి జెడ్పీటీసీ కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరావు, చోడిపల్లి గోవిందు, సర్పంచ్ మల్లే లోవరాజు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కొవిరి రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన వీసం



ఎమ్మెల్యే బాబూరావును కలిసిన రామకృష్ణ తదితరులు

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ గురువారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును కలిసారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో కలిసిన వీసం రామకృష్ణకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఐకమత్యంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తీసుకు రావాలన్నారు. త్వరలోనే గడప గడపకు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించి ప్రజా సమస్యలపై దృష్టి పెడదామన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, సీనియర్ నాయకులు వెంకటేష్, సత్తిబాబు, అల్లాడ కొండ ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గా ప్రసాద్ కోరారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతుల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఆశాదేవీలు పర్సనల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

గూటూరు శ్రీనివాసరావుకు మంత్రి పరామర్శ



గూటూరు శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

పాయకరావుపేట : పాయకరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావును రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. శ్రీనివాసరావు అస్వస్థతకు గురై కాకినాడ ఆసుపత్రిలో వైద్యం పొంది స్వగృహానికి వచ్చారు. ఆయన స్వగృహంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. మంత్రి దాడిశెట్టి రాజా శ్రీనివాసరావును పలకరించి ధైర్యం చెప్పారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మంత్రి రాజాతో పాటు తుని నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, ప్రముఖ వ్యాపారవేత్తలు దేవవరపు కళ్యాణ్, దాసరి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



మునగపాక సంతబయల రామాలయంలో మహా చండీహోమం

మునగపాక : మునగపాక సంతబయల రామాలయంలో గురువారం కనకదుర్గ అమ్మవారికి మహా చండీహోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వేడుకగా హోమం జరిపారు. సాయి పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తంపరమూల రైతు సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల మణికంఠ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతారామరాజు, శివ గణేష్, ఆది శివ, ధర్మరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.